క్లుప్తంగా

అమర లింగేశ్వరుణ్ని దర్శించుకున్న ఎస్పీ



గురజాల రూరల్: మండల పరిధిలోని దైద గ్రామంలో ఉన్న అమరలింగేశ్వరస్వామి దేవాలయాన్ని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం రాత్రి సందర్శించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులకు ఆయన సూచించారు. ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. చైర్మన్ వెంపటి సాంబశివరావుతో మాట్లాడారు. డీఎస్పీ బి.జగదీష్, సీఐ ఆవుల భాస్కర్ ఆయన వెంట ఉన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య నేర్పించాలి

దాచేపల్లి: చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలని ఎంఈఓ పినాకపాణి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన శక్తిపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు చదువుపై ఆసక్తి పెరిగేలా వారితో మెలగాలని, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పాఠశాల వైపునకు వారిని నడిపించాలని ఎంఈవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఆర్పీలు కోటేశ్వరరావు, రాజశేఖర్, రాములు, సీఆర్పీలు అబ్రహాం, చంద్రమోహన్, వెంకటేష్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



గురజాల: దాతలు ముందుకొచ్చి పేదలకు అన్నదానం, తమ వంతు సహాయ సహకారాలు అందించాలని స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీ విశ్వనాథం అన్నారు. కొమ్మారెడ్డి నాసరరెడ్డి జ్ఞాపకార్థం పట్టణంలోని పాతపాటేశ్వరి దేవాలయం ప్రాంగణంలో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బొల్లాకు బహుమతి



పిడుగురాళ్ల: వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జన్మదినం సందర్భంగా ఆయనకు పిడుగురాళ్ల పల్నాడు హాస్పటల్ అధినేత, గురజాల వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్కూల్ టీచర్ ఫర్హా బొల్లా బ్రహ్మనాయుడు దంపతుల చిత్రాన్ని గీసి మంగళవారం నర్సరావుపేటలోని నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా బొల్లా ఫర్హానకు, డాక్టర్‌చింతలపూడి అశోక్ కుమార్‌కు అభినందనలు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి సన్నిధిలో మంత్రి గొట్టిపాటి



కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల సందర్భంగా మంగళవారం వీరబ్రహ్మేంద్రస్వామిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో బ్రహ్మంగారి మఠాధిపతి వీరబ్రహ్మాచారి, గుడి పెద్దలు స్వాగతం పలికారు. అంతకు ముందు కారెంపూడి ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో టీడీపీ నాయకులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే జూలకంటి సమావేశమయ్యారు. ఒప్పిచర్ల తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో అందరూ పాల్గొన్నారు. కార్యకర్తలు, నాయకులను గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత జరిగిన విలేకర్ల సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

గురజాల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ గౌసియా బేగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

కుమిలిపోతున్న రైతన్న

ఆరుగాలం శ్రమించే రైతన్నలకు కూటమి ప్రభుత్వంలో ఎదురుగాలి వీస్తోంది. అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి, చీడ పీడలను తట్టుకొని వ్యయ ప్రయాసాలకోర్చి పంటలను పండించినా.. ఆ పంటలకు మద్దతు ధర లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కూలీలకు, కౌలు బాకీలు చెల్లిస్తూ ఉన్నకాడికి పంటను అమ్ముకున్నా.. గట్టెక్కలేని దుస్థితి నెలకొంది.

- ప్రకృతి విపత్తులు ఎదుర్కొన్నా.. 'కూటమి' విపత్తుతో చిత్తు
- పంట చేతికొచ్చినా మద్దతు ధర కల్పించని ప్రభుత్వం
- పూర్తిగా కుదేలైన మిర్చి, కంది సాగుదారులు
- తమ పరిస్థితి మరీ దైన్యమంటున్న వరి, పత్తి రైతులు
- అయినకాడికి పంటను తెగనమ్ముకుంటున్న అన్నదాతలు
- దళారుల చేతుల్లోనే కొనుగోళ్లు..



కందులను ఇంటికి చేర్చి ఆరబోస్తున్న రైతులు



పంట చేలో మిరపకాయలను గోతాల్లోకి సర్దుతున్న రైతులు

మాచర్ల రూరల్: ఈ సారి వర్షాలు ముందుగానే కురిశాయి. చెరువులు, కుంటల్లోకి నీరు చేరుకోవడమే కాకుండా.. నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో నీరు చేరడంతో రైతులు గంపెడాశలతో వరి, పత్తి, మిర్చి, కంది సాగుకు శ్రీకారం చుట్టారు. వ్యయ ప్రయాసలకోర్చి పంటలను సాగు చేసి అమ్మ జూపితే గిట్టుబాటు ధర లేక దళారుల చేతిలో పంటలను తెగనమ్ముకుని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

తెల్లబోయిన తెల్ల బంగారం

మెట్ట ప్రాంతాల్లో పత్తి పంట ఆకుపచ్చ, యర్ర కుళ్లు తెగుళ్లతో దిగుబడి తగ్గిపోయింది. అకాల వర్షాలకు ఎకరాకు 15 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి..5 క్వింటాళ్లకే పరిమితమైంది. దీంతో రైతన్నలకు ఆదిలోనే భారీగా దెబ్బతగిలింది.

ఘాటు తగ్గిన మిర్చి

వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లతో మిర్చి పంట కూడా ఆశించినంత దిగుబడి రాలేదు. వచ్చిన కొద్ది పాటి పంటకు కూడా కూటమి ప్రభుత్వం మద్దతు ధర కల్పించలేకపోయింది. ఎకరా సాగుకు రూ.80ల నుంచి రూ.లక్ష ఖర్చు అవుతుంది. 12 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉంది.కానీ, ప్రస్తుతం 5 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. పోనీ, మార్కెట్‌లో విక్రయిద్దామంటే.. క్వింటా రూ.12 వేల ధర మాత్రమే పలుకుతోంది. గతేడాది మిర్చి రూ.18 వేల నుంచి 22 వేల వరకు ధర పలికింది.

ధాన్యం..దైన్యం..

సమృద్ధిగా వర్షాలు కురిసి, నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా నీటి విడుదలతో రైతులు వరి పంట సాగుకు శ్రీకారం చుట్టారు. ధాన్యం చేతికందే సరికి 75 కేజీల బస్తా రూ.1,300ల నుంచి రూ. 1,400లకు మాత్రమే కొంటామని దళారులు తెగేసి చెప్తున్నారు. ఇదే ధాన్యం గతేడాది రూ.1,800ల నుంచి రూ. 2 వేలు ఉంది. ఒక ప్రక్క ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తున్నామని చెబుతున్నా.. ఏ కేంద్రంలోనూ పంటను కొనుగోలు చేయలేదు.

'కంది'పోతున్న రైతు

ఇక కంది పంట రైతుల కష్టాలు వర్ణనాతీతం. ఒక వైపు రిటైల్ మార్కెట్‌లో కంది కేజీ రూ.160కి పై మాటే విక్రయిస్తున్నారు. అయినా.. కంది రైతుకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పించలేకుంది. కందులు క్వింటాకు రూ.4,750 నుంచి రూ. 6,170 వరకు దళారులు చెల్లింపులు చేస్తున్నారు. గతేడాది రూ.7,830 నుంచి రూ.8,600 ధర ఉంది. ఇప్పుడు నాణ్యత సాకు చూపుతూ రైతులను దళారులు దోచుకుంటున్నారు.

గత ప్రభుత్వంలో రైతు సంక్షేమం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు భరోసా కల్పించింది. మార్కెట్ లో మద్దతు ధర దక్కని సమయంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటలను కొనుగోలు చేసి, రైతులకు అండగా నిలిచింది. అంతేకాకుండా రైతులకు ఆర్థిక భరోసా, సున్నా వడ్డీ రుణాలు, కౌలు రైతు కార్డులు అందించడమే కాకుండా ధాన్యం, కందులు, పత్తి పంటలకు దళారుల బెడద లేకుండా రైతుల వద్దకే వెళ్లి ప్రభుత్వమే పంటను కొనుగలు చేసిది.

రైతులను నిండా ముంచిన కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం రైతులను నిండా ముంచేసింది. అన్నదాత సుఖీభవ కింద ఒక్క రూపాయి కూడా పెట్టుబడి సాయమందించలేదు. రైతుల కష్టాలను మరింత పెంచింది. పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తామని మోసం చేసింది. డబ్బులు లేవు, సంపద సృష్టిస్తా.. సంపాదన మార్గముంటే నా చెవిలో చెప్పాలంటూ సీఎం చంద్రబాబు కూడా చేతులెత్తేశారు.

మిర్చి పంటతో నష్టపోయాం



ఎంతో శ్రమ పడి మిర్చి పంటను సాగు చేశాను. పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు. కోల్డ్ స్టోరేజి లో స్టాకు చేద్దామన్నా గతేడాది స్టాకు పెట్టిన రైతులు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో దిక్కు తోచక నష్టానికే పంటను అమ్ముకున్నాను.

– ఆరికట్ల కోటిరెడ్డి, కొత్తపల్లి

దళారులకు అమ్ముకున్నా..



ఈ ఏడాది వరి పంట సాగు చేశాను. పంటను అమ్ముదామనుకుంటే 75 కేజీల బస్తా రూ.1,300 నుంచి రూ. 1,400లకే కొనుగోలు చేస్తున్నారు. రైతు కేంద్రాల్లో విక్రయిద్దామనుకుంటే.. కొనేవారు లేరు. దీంతో రూ. 1,300లకే అమ్ముకొని నష్టపోయా.

– బొడ్డు నరసింహారావు, లింగాపురం కాలని

ప్రభుత్వం ఆదుకోలేదు



పత్తి ప్రత్యామ్నాయ పంటగా కంది వేశాను. గతేడాది కందులు రూ.7,300ల నుంచి రూ. 8,600 ఉండగా, ప్రస్తుతం రూ. 4,700 నుంచి రూ. 6,170కి పడిపోయింది. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవటంతో దళారులకు అమ్ముకుంటున్నాం.

– ముక్కా గురవయ్య, జమ్మలమడక, రైతు

పావుగంట ప్రాణం విలవిల



తీగలపై నుంచి కోతి పిల్లను ఒళ్లోకి తీసుకుంటూ..



గండం గట్టెక్కాక క్షేమంగా కిందకి దిగుతూ..

కారెంపూడి: కరెంట్ తీగలపై చిక్కుకున్న కోతి పిల్లను రక్షించుకోడానికి తల్లి పడిన వేదన.. స్థానికుల స్పందనతో క్షేమంగా బిడ్డను తల్లి కోతి రక్షించుకున్న సంతోషకర ఘటన.. కారెంపూడిలో జెండా చెట్టు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పావు గంట విద్యుత్ తీగలపై బిడ్డ విలవిల్లాడితే..దాని పరిస్థితి చూసి తల్లి ప్రాణం విలవిల్లాడింది. చివరకు బిడ్డను కిందకు దించి రక్షించుకుంది. స్థానికులు, విద్యుత్తు సిబ్బంది వివరాల మేరకు.. పట్టణంలోని 1వ వార్డు జెండా చెట్టు మీదకు ఎక్కిన కోతి పిల్ల విద్యుత్తు తీగలపై పడింది. వెంటనే గమనించిన స్థానికులు సెక్షన్ ఆఫీస్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది కరెంటు నిలిపివేశారు. ఈ లోగా పిల్ల కోతి తల్లితో పాటు కోతుల గుంపు ఆ పరిసర ప్రాంతానికి చేరుకుంది. తల్లి కోతి తన బిడ్డను రక్షించుకోవడం కోసం స్తంభం ఎక్కడం.. దిగడం చేసింది. విద్యుత్ సప్లయ్ ఆపడంతో తీగలపై పడిన కోతి పిల్లలో కదలిక వచ్చింది. ఇక సంతోషంతో తల్లి కోతి పైకి ఎక్కి తన బిడ్డను పట్టుకుని క్షేమంగా కిందకు దిగింది. కోతి పిల్ల ప్రాణాలు నిలవడంతో దీనిని వీక్షిస్తున్న ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. బిడ్డ క్షేమంగా బయట పడడంతో అక్కడ గుమికూడిన కోతులన్నీ వెళ్లిపోయాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు పావు గంట పాటు అంతరాయం కలిగింది.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



ధ్రువీకరణ పత్రాలు పొందిన విద్యార్థులతో జర్మనీ దేశస్తురాలు బార్బోరా, ఉపాధ్యాయులు

అచ్చంపేట: విద్యార్థులు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, ప్రాథమిక స్థాయి నుంచే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జర్మనీ దేశస్తురాలు బార్బోరా అన్నారు. మండలంలోని తాళ్లచెరువు సెంట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో యూకేజి విద్యార్థుల స్నాతకోత్సవం, సైన్స్ ఎక్స్‌పోలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞాన, వినోదాత్మక విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రలాను పంపిణీ చేశారు. ఐఐటీ ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీలలో 2, 3 ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులు చేపట్టిన సృజనాత్మక ప్రాజెక్టులను, సైన్సు పరికరాలను, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. ఆమెతో పాటు సిరిపురం చర్చి విచారణ గురువులు ఫాదర్ తోమాస్, తల్లిదండ్రులు, హెచ్‌ఎం మేరి వినయ, సిస్టర్ హెజ్బెల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఆనంద్ బాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.ఆనంద్‌బాబును నియమిస్తూ జీఓ ఆర్టీ నెంబర్ 116 ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ నుంచి మంగళవారం రాత్రి వెలువడింది. ఇప్పటి వరకు ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కొలిమి షమ్మీ ఇటీవల గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి పొందడంతో ఆయనను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ జీవో ఆర్టీ నెంబర్ 117 వెలువడింది. గుంటూరు నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ బాబు పదోన్నతి పొంది సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారు. బదిలీపై వెళ్తున్న కొలిమి షమ్మీ కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఏఓగా పని చేస్తూ పదోన్నతిపై సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా 2021 డిసెంబర్ 29న వచ్చారు. పట్టణ ప్రజలకు మెరుగైన వసతుల కల్పనకు ఆయన కృషి చేశారు.

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

జిల్లా దేవదాయ శాఖ అధికారి అచ్యుత్



రాజుపాలెం: దేవరంపాడు కొండపై ఐదు శనివారాలు జరిగే తిరునాళ్లను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారి అచ్యుత్ తెలిపారు. మండలంలోని దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో సురేష్‌ను తిరునాళ్ల ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ జిల్లా అధికారి మాట్లాడుతూ తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, కావున ఒత్తిడి లేకుండా, భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఈవోకు సూచనలు చేశారు. అధిక సిబ్బందిని తెప్పించుకోవాలని, బందోబస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని తెలిపారు. ఆయన వెంట ఈవో సురేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు



నకరికల్లు: రోడ్డు ప్రమాదాలు తరచూ జరిగే ప్రాంతాలను గుర్తించి అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు సూచించారు. మండలం పరిధిలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు పోలీస్, రవాణా శాఖ అధికారులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ పోలీస్, రవాణా శాఖ, రోడ్డు భద్రత సిబ్బంది, ఎన్‌ఏఎం అధికారులతో యాక్సిడెంట్ స్పాట్‌లు గుర్తించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చల్లా సురేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ మనీషా, ఎన్‌ఏఎం ప్రాజెక్టు అధికారులు శ్రీకాంత్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్రశాలలో శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష రేపు

రెంటచింతల: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సత్రశాలలోని శ్రీ గంగా మల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆవరణలో ఈ నెల 20న ఉదయం 9 గంటలకు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మూఢావత్ అర్జున్‌నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ, దేవాదాయ, పోలీసు, రెవెన్యూ శాఖాధికారులు, మండలస్థాయి వివిధ శాఖాధికారులు, మాచర్ల ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్, టెయిల్‌పాండ్ ప్రాజెక్టు అధికారులు, పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, దేవస్థానం పాలకవర్గం సభ్యులు, వివిధ అన్నదాన సత్రాల కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఇప్పటి వరకు జరిగిన శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షించి, చేపట్టాల్సిన పనులపై చర్చించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సీఎం సహాయ నిధి నగదు చెక్కులను బాధితులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో అనారోగ్యంతో చికిత్స పొందిన 21 మంది లబ్ధిదారులకు రూ. 21,07,128 అందించినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లాంగ్వేజ్ ఫెస్టివల్



దుగ్గిరాల: దుగ్గిరాలలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం లాంగ్వేజ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఆంగ్ల బాషా అవశ్యకతను విద్యార్థులకు తెలియజేసి, రైమ్స్, యాక్షన్ సాంగ్స్ పాడించారు. విద్యార్థులందరికి పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.శోభాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రెంటచింతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బ్రిటీష్‌కాలంలో నిర్మించిన బ్రిడ్జి పగిలి, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉంది. రైల్వే స్టేషన్‌కు, రెంటాల గ్రామానికి వెళ్లే రహదారిలో 1939లో నిర్మించిన ఈ బ్రిడ్జి ఒక అంచున పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో స్థానికులు రాళ్లు, మట్టి పోసి దానిని పూడ్చారు. బ్రిడ్జి ఒక వైపునకు రోజురోజుకు కుంగిపోతుండటంతో వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రతి రోజు ఈ బ్రిడ్జిపై నుంచి తహసీల్దార్ కార్యాలయానికి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, రైల్వేస్టేషన్‌కు, పలు కాలనీలకు చెందిన ప్రజలతో పాటు రెంటాల గ్రామానికి వందల సంఖ్యలో వాహనదారులు వెళ్తుంటారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి వడ్డవల్లి పోలేరమ్మ తల్లి వార్షికోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

సత్తెనపల్లి: పట్టణంలోని వడవల్లిలో వేంచేసి ఉన్న పోలేరమ్మ తల్లి 17వ వార్షికోత్సవాలు ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు జరగనున్నాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మహాశక్తి స్వరూపిణి గ్రామ దేవత వడ్డవల్లి పోలేరమ్మ తల్లి దేవాలయంలో ఈ నెల 19న తెల్లవారు జామున 4 గంటల నుంచి మంగళవాయిద్య సహిత తోరణ, సుప్రభాత సేవ, గణపతి పూజ, బ్రహ్మ కలశారాధన, పంచామృత సహిత ఏకాదశ ద్రవ్యాలతో పోలేరమ్మ తల్లికి, దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించనున్నారు. 11 గంటల నుంచి దివ్య అలంకరణ అనంతరం దివ్య దర్శనం, శ్రీచక్ర సహిత దుర్గా సహిత శ్రీసూక్త సమేతంగా అమ్మవార్లకు దివ్య కుంకుమ పూజ, సహస్ర నామ పుష్పార్చన, గాజుల అలంకార సేవ, విశేష పూజా కార్యక్రమాలు, ధూప దీప నైవేద్య సహిత తీర్థ ప్రసాద వినియోగం చేపట్టనున్నారు. సాయంత్రం భజన సంకీర్తనలు, లలితా సహస్ర నామ పారాయణం, దీపోత్సవం చేపడుతారు. ఈ నెల 20న అమ్మవార్లకు మొక్కుబడులు, ముడుపులు చెల్లించుట, విశేష కుంకుమ పూజలు, భజన సంకీర్తనలు నిర్వహిస్తారు. 21న ధనలక్ష్మి అలంకరణ, అమ్మవార్లకు పొంగళ్లు (11 రకాల మహా నైవేద్యాలు) సమర్పించడం, లక్ష్మీ పూజ, ముత్తైదువులచే (మంగళ గౌరీ పూజ) కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. దేవస్థాన పురోహితులు బ్రహ్మశ్రీ గూడవల్లి అనీల్ కుమార్ శర్మ, కొమ్మూరి వెంకట రమేష్ శర్మల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

అధికార బలంతో ప్రజల గొంతు నొక్కుతున్న కూటమి ప్రభుత్వం

రాజుపాలెం: మండలంలోని ఉప్పలపాడు పంచాయతీ శివారు లక్ష్మీపురంతండాకు చెందిన రైతు బాణావతు బుల్లానాయక్ మీడియా ముందు నాకు ఇంతవరకు రైతు భరోసా లేదు, నా కూతురికి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ రాక ప్రస్తుతం ఇంటిలోనే ఉంది. గత ఏడాది జగన్ ప్రభుత్వంలో కల్లాల్లో ధాన్యాన్ని బస్తా రూ.2200కు కొన్నారు, ఈ ప్రభుత్వంలో బస్తా రూ.1300కు అమ్మాను. అదే విధంగా మిర్చి జగన్ ప్రభుత్వంలో క్వింటా రూ.22 వేలకు అమ్మాను, ఈ ప్రభుత్వంలో రూ.10 వేలకు కూడా కొనే దిక్కులేదు, పత్తి గత ఏడాది రూ.8 వేలు, రూ.9 వేలు అమ్మింది, ఇప్పుడు రూ.4 వేలకు కూడా కొనే దిక్కులేదని, పండించిన పంటలకు గిట్టుబాటు లేదని, రైతులు కోలుకునేందుకు పదేళ్లు పడుతుందని తన బాధను వెల్లబుచ్చి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించినందుకు గత మూడు రోజులుగా పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పుతూ మంగళవారం అరెస్టు చేశారు. ఈ అరెస్టు టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే జరిగినట్లు గ్రామస్తులు, బంధువులు ఆరోపిస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను అధికార బలంతో, టీడీపీ నాయకుల అత్యుత్సాహంతో హరించి వేస్తున్నారన్నారు. ప్రభుత్వ జులూంతో అభిప్రాయాలను తదదైన శైలిలో వెల్లబుచ్చిన బుల్లానాయక్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచేందుకు తీసుకెళ్లారు. దీనిని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండిస్తున్నారు.

స్విమ్మర్లకు సత్కారం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి వాసులు ఈత పోటీల్లో పలుమార్లు ప్రతిభ చూపారు. విజయవాడ దుర్గ ఘాట్ వద్ద కృష్ణానదిలో ఆక్వా డెవిల్స్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1.5 కిల్లో మీటర్ల ఈత పోటీలో షేక్ గని, నిమ్మగడ్డ హనుమంతరావు, కాకుమాను జోజి, పెరుమాళ్ళ శ్రీనివాస్, చంద్రపాటి శ్రీనివాస్, పోతుగంటి నరసింహారావు, కాకర్ల రమేష్, ఆదిరెడ్డి, సాంబశివరావు, రాజేష్ నాయక్, బుజ్జి ప్రతిభ చూపారు. అంతేగాక 68 సంవత్సరాల వయసులో పోతుగంటి నరసింహారావు కృష్ణానదిని ఈదాడు. ఈత పోటీల్లో పాల్గొని కృష్ణానదిని పలుమార్లు దాటి బహుమతులు పొందిన స్విమ్మర్లను మంగళవారం స్విమ్మింగ్ సహచరులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్విమ్మర్లు గద్దె చలమయ్య, డాక్టర్ సుధాకర్ రావు, బగ్గి నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు, సుబ్బారావు, పొట్ల అంజి, పూర్ణ, ఆకుల హనుమంతరావు, ఏడుకొండలు (ఈ.కే) అన్నా సుమన్, దాసరి తిరుపతి రావు, పాల్ కుమార్, రాజ్ వీర్ ఉన్నారు.

చిలకలూరిపేట ఎంఈఓను వెంటనే నియమించాలి

సత్తెనపల్లి: చిలకలూరిపేట మండల విద్యా శాఖ అధికారిని వెంటనే నియమించాలని పీఆర్టీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బంకా వాసు బాబు మంగళవారం కోరారు. ఇటీవల కాలంలో చిలకలూరిపేట మండల విద్యా శాఖ అధికారిగా పనిచేస్తున్న లక్ష్మీ ఏసీబీ వలలో చిక్కి సస్పెండ్ అయిన సంగతి తెలిసిన విషయమేనన్నారు. ఆమె స్థానంలో కొత్తగా ఎంఈఓని నియమించాలన్నారు. చిలకలూరిపేట మండలంలోని ఉపాధ్యాయులు జీతాల కోసం ఇబ్బంది పడకుండా ఉండటానికి వీలుగా కొత్త మండల విద్యాశాఖ అధికారిని నియమించవలసిందిగా కోరారు.